క్లుప్తంగా

శిశుమందిర్ ప్రధానాచారికి ప్రశంసాపత్రం



ప్రధానాచారి అరుణకు ప్రశంసాపత్రం అందించి సన్మానిస్తున్న శిశుమందిర్ ప్రతినిధులు

మలికిపురం: మండలంలోని లక్కవరం సరస్వతీ శిశు మందిరం హైస్కూల్‌కు 2023–24కు 100% టెన్త్ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో సంస్థ రాష్ట్ర స్థాయి ప్రతినిధుల నుంచి హైస్కూల్ ప్రధానాచారి వి.అరుణ ప్రశంసాపత్రం అందుకున్నారు. బుధవారం అనంతపురంలో జరిగిన సంస్థ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ మేరకు ప్రశంసా పత్రం, మెమెంటో అందుకున్నారు. ఈ సమావేశానికి పాఠశాల నుంచి సమితి ఉపాధ్యక్షుడు ఆర్‌సీవీ రాజు, అధ్యక్షుడు మంగెన గౌరీనాథ్, కమిటీ సభ్యులు నంద్యాల వెంకట కృష్ణ, సహ ప్రధాన ఆచార్య ప్రమీల హాజరయ్యారు.

రేపు మండల పరిషత్ సమావేశం

పి.గన్నవరం: ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి తెలిపారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పలువురికి ఆర్థిక సాయం



ఆపన్నులకు ఆర్థిక సాయం అందిస్తున్న బుజ్జిరాజు

మలికిపురం: రాజోలు, మలికిపురం మండలాల్లో అనారోగ్యం వల్ల ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నలుగురికి వసుధ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం అందించారు. చైర్మన్ మంతెన వెంకట రామరాజు సమకూర్చిన ఆర్థిక సాయాన్ని చెక్‌ల రూపేణా బుధవారం వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు చేతుల మీదుగా మలికిపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో అందించారు. పొన్నమండకు చెందిన చిన్నారి కుసుమ సత్యశ్రీకి రూ.పదివేలు, కొల్లాటి శ్రీను(డయాలసిస్) అడవిపాలేనికి చెందిన డయాలసిస్ వ్యాధిగ్రస్తుడు కొల్లాటి శ్రీనుకి రూ.10 వేలు, ఇరుసుమండకు చెందిన గుండె ఆపరేషన్ చేయించుకున్న బండారు వెంకటేశ్వర్లుకు రూ.పదివేలు, గుడిమెళ్లంకకు చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు నల్లి లలితకు రూ.పదివేలు చొప్పున మొత్తం రూ.40 వేలను సాయంగా అందించారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధి బోనం రాజుతో పాటు, సఖినేటిపల్లి సర్పంచ్ జి.చిట్టిబాబు, అటారం మాస్టారు, కాజా నరసింహారావు, గ్రామాల్లోని పెద్దలు పాల్గొని వెంకట రామరాజు చేస్తున్న సేవలను కొనియాడారు.


క్యాన్సర్ బాధిత చిన్నారికి రూ.20 వేల సాయం



బాధిత కుటుంబ సభ్యునికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సంస్థ సభ్యులు

రావులపాలెం: క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు బుధవారం రూ.20 వేల నగదు సాయంగా అందజేశారు. కొత్తపేట మండలం వానపల్లి శివారు సంగంపాలెంకి చెందిన గుత్తుల దుర్గాప్రకాష్ ఫొటోగ్రాఫర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతని కొడుకు వెంకట సాత్విక్ (5)కి బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్సకు క్యాన్సర్‌కి సంబంధించిన సర్జరీ చేయాల్సి ఉంది. దీనికి రూ.50 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. సహాయం కోసం కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ సభ్యులను కోరడంతో రావులపాలెంలో సాత్విక్ చిన్నాన్న దుర్గాప్రసాద్‌కి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.20 వేల ఆర్థిక సాయం అందజేసినట్టు సభ్యులు తెలిపారు.

గోశాలకు దాణా వితరణ



అంతర్వేది గోశాలకు దాణా వితరణ చేస్తున్న దాత వెంకటేశ్వరరావు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలోని గోశాలకు బుధవారం మండలంలోని కేశవదాసుపాలెంకు చెందిన బెల్లంకొండ వెంకటేశ్వరరావు, సత్యవతి దంపతులు కుమార్తె హేమలత పుట్టినరోజు పురస్కరించుకుని రూ.6 వేలు విలువైన 250 కేజీల దాణా వితరణ చేశారు. ఈ మేరకు ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి సమక్షంలో గోశాల సిబ్బందికి దాణాను అందజేశారు. బొలిశెట్టి శ్రీరామ్, స్వామివారి సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆందోళన కలిగిస్తున్న విషసర్పాలు

- నాలుగు నెలల్లో నియోజకవర్గంలో 37 కేసులు
- వర్షాకాలం మరింత భయం భయం
- హడలెత్తుతున్న ప్రజలు



మామిడికుదురు: వర్షాకాలం సీజన్‌లో విష సర్పాల బెడద ప్రజల్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఎక్కడ చూసినా పాముల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు కలవరం చెందుతున్నారు. వేసవి కాలంతో పాటు శీతాకాలంలో విష సర్పాల ప్రభావం నామమాత్రంగా ఉంటుందని, ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో మాత్రం పాముల బెడద ఆందోళన కలిగిస్తోందని ప్రజలు వాపోతున్నారు. వర్షాలకు ఎక్కడికక్కడ విపరీతంగా గడ్డి మొలిచిపోవడంతో పాములు విచ్చల విడిగా సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పొలాల్లోనే పాముల బెడద ఉండేదని ఇటీవల కాలంలో నివాస ప్రాంతాల్లో సైతం విషసర్పాల బెడద తీవ్రంగా ఉంటోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరికి భారీ వరద వస్తే పాముల నీటి ప్రవాహానికి కొట్టుకుపోయేవని, రెండేళ్ల నుంచి భారీ వరద రాకపోవడంతో పాముల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని చెబుతున్నారు.

పాము కాటు కేసుల వివరాలు...

పి.గన్నవరం నియోజకవర్గంలోని మామిడికుదురు, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాల పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇంత వరకు 37 పాము కాటు కేసులు నమోదయ్యాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో ఒక సీహెచ్‌సీతో పాటు ఏడు పీహెచ్‌సీలు ఉన్నాయి. వాటిలో పి.గన్నవరంలోనే 30 కేసులు, ఇదే మండలంలోని నాగుల్లంకలో ఒక కేసు వెరసి ఈ మండలంలో 31 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. నగరం పీహెచ్‌సీలో అయిదు, లూటుకుర్రు పీహెచ్‌సీలో ఒక కేసు నమోదయ్యాయని ప్రభుత్వ వైద్యాధికారులు తెలిపారు. విషం కాటుకు వినియోగించే యాంటీ స్నేక్ వీనమ్ వైల్స్ (ఏఎస్‌వీ) పీహెచ్‌సీలో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

పాముల బెడద తీవ్రంగా ఉంది



ప్రస్తుత కాలంలో పాముల బెడద తీవ్రంగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పాములు సంచరిస్తున్నాయి. లంక గ్రామాల్లో ఎక్కడ చూసినా పాముల సంచారంపైనే చర్చ జరుగుతోంది. ప్రతి ఒక్కరూ పాముల పేరు చెబితేనే హడలి పోతున్నారు. పాముల బెడద అంతగా ప్రజల్ని కలవర పెడుతోంది. పాము కాటు విరుగుడు ఇంజక్షన్లు ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

– కుంపట్ల వెంకటేశ్వరరావు, రైతు, పెదపట్నంలంక

భయపడుతూ పని చేస్తున్నాం



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు ప్రతి రోజు భయం భయంగా పనులు చేయాల్సి వస్తోంది. పనులు చేస్తున్న సమయంలో చాలా చార్లు పాములు కనిపించాయి. వర్షాకాలంలో పరిస్థితి దారుణంగా ఉంటోంది. గోదావరి తీరంలోని లంక గ్రామాల్లో పాముల బెడద తీవ్రంగా ఉంది. తగిన జాగ్రత్తలతోనే ఉపాధి పనులు చేస్తున్నాం. ఏఎస్‌వీ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలి.

– గోగి హేమలత, ఉపాధి మేట్, బి.దొడ్డవరం

ప్రథమ చికిత్స అందించాలి



పాము కాటు కేసులు ఇటీవల ఎక్కువగా నమోదవుతున్నాయి. పాము కాటుకు గురైన వారికి వెంటనే ప్రథమ చికిత్స అందించాలి. పాము కాటుకు గురైన వారు సాధ్యమైనంత వరకు నడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పాము కరిచిన ప్రదేశం పైభాగం గట్టిగా కట్టు కట్టాలి. పాము కాటు బారిన పడిన వారిని వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వెళ్లి చికిత్స అందించాలి. పీహెచ్‌సీలో ఏఎస్‌వీ ప్రజలకు అందుబాటులో ఉంది.

– స్పందన, వైద్యాధికారి, లూటుకుర్రు పీహెచ్‌సీ

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం రావులపాలెం సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే అన్ని ఫీడర్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, రావులపాడు, ఊబలంక, కొమరాజులంక, రావులపాలెంలోని ఆదిలక్ష్మీనగర్ ఏరియా, సీఆర్‌సీ రోడ్డు, డిగ్రీ కాలేజీ ఏరియా, అంకాలమ్మ గుడి ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీమన్నారాయణకు డాక్టరేట్

ముమ్మిడివరం: మండలంలోని గేదెల్లంకకు చెందిన కోలా శ్రీమన్నారాయణకు విశాఖ గీతం విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఆయన ప్రస్తుతం అనకాపల్లి జిల్లా సక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. మెటీరియల్ సైన్స్‌లో బేరియం, కాల్షియం, జిర్కోనియం ప్రతిక్షేపణలపై చేసిన పరిశోధనలకు ఆయనకు డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా ఆయనను మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ముమ్మిడివరం ఎంపీపీ కోలా గంగాభవానీ, కోలా బాబ్జి తదితరులు అభినందించారు.

అధ్వానంగా ఉన్నత పాఠశాల రోడ్డు



వర్షపు నీరు నిలిచిపోవడంతో అధ్వానంగా మారిన కడలి రోడ్డు

రాజోలు: కడలి గ్రామంలో ప్రధాన రహదారి పూర్తిగా అధ్వానంగా మారింది. కడలి సెంటర్ నుంచి చెన్నడం, పొన్నమండ గ్రామాలకు వెళ్లే ప్రజలు ఈ రహదారిలో ఎక్కువగా ప్రయాణం చేస్తారు. కడలి ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులతో పాటు, ప్రముఖ పుణ్యక్షేత్రమైన కడలి కపోతేశ్వరస్వామి వారి ఆలయానికి వెళ్లే భక్తులు రోడ్డు పాడైపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై గుంతలు ఏర్పడడంతో కొద్దిపాటి వర్షానికే ముంపునకు గురవుతుంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న బెర్మ్‌లను సరిచేసి వర్షం నీరు దిగేందుకు మార్గాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. రోడ్డు నిర్మాణం పనులు త్వరితగతిన చేపట్టి ప్రయాణికులు, విద్యార్థులు, భక్తుల ఇక్కట్లు తొలగించాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి రొక్కాల సందీప్, రాజాబాబు, ప్రకాష్, అనిల్ కోరుతున్నారు.

ఊడిమూడిలంక వంతెన పనుల పరిశీలన



ఊడిమూడిలంక వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఎస్ఈ రవీంద్ర

పి.గన్నవరం: వశిష్ట నదీపాయపై రూ.49.5 కోట్లతో నిర్మిస్తున్న ఊడిమూడిలంక వంతెన నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ ఎస్ఈ రవీంద్ర బుధవారం పరిశీలించారు. గతంలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లంక గ్రామాల ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం గతేడాది వంతెన పనులను ప్రారంభించిన విషయం విదితమే. శరవేగంగా జరుగుతున్న ఈ వంతెన పనులపై ఎస్ఈ రవీంద్ర సంతృప్తి వ్యక్తం చేశారు. 3, 4వ నంబర్ల పిల్లర్లకు వెల్ ఫౌండేషన్‌ను పరిశీలించి బాటమ్ ప్లగ్గింగ్‌కు ఆయన అనుమతి ఇచ్చారు. వరదలు వచ్చేలోగా ఈ పనులను పూర్తి చేయాలని అధికారులను ఎస్ఈ ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ కె.చంటిబాబు, డీఈఈ అన్యం రాంబాబు, ఏఈఈలు కొండలరావు, సత్యనారాయణ, కాంట్రాక్టర్ పీపీ రాజు, డిజైనర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషక లోపమే దిగుబడికి అడ్డంకి



కేశనపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మలికిపురం: పోషక లోపమే దిగుబడికి అడ్డంకి అని ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి ఎలియాజార్ అన్నారు. బుధవారం కేశనపల్లిలో కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇందుకు సంబంధించి ఏక పంటల విధానం, పోషకాల లభ్యత, చీడపీడలు, సక్రమంగా లేని నీటి యాజమాన్యం, కలుపు సమస్యలపై ఎలియాజార్, కొబ్బరి రైతులతో చర్చించారు. ఈ మేరు ఆయా అంశాలపై సమగ్ర సమాచారం వారికి అందించి, తగిన సలహాలు, సూచనలు అధికారుల నుంచి పొందాలని కోరారు. అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, రైతులు యడ్ల విష్ణుమూర్తి, గెద్దం వసంత కుమార్, అడబాల మూలాస్వామి, నల్లి నాగేశ్వరరావు, రావూరి ఏసు, యడ్ల వెంకట రమణ, వ్యవసాయ సిబ్బంది మట్టా శ్రీనివాసరావు, మురళి, కిరణ్, నాగబాబు, సురేష్, రవికాంత్ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

- హుస్సేన్ త్యాగం అజరామరం
- కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నగరంలో గుమ్మటం మోస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ అతని పరివారం చేసిన త్యాగం అజరామరమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శ్లాఘించారు. మొహర్రం సందర్భంగా మామిడికుదురు, నగరం గ్రామాల్లో బుధవారం జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి పీర్లు, గుమ్మటాలను మోశారు. అచంచలమైన భక్తికి మొహర్రం నిదర్శనంగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. రక్తం చిందిస్తూ హజరత్ ఇమామ్ హుస్సేన్‌తో పాటు అతని పరివారానికి నివాళులర్పించడం ముదావహమన్నారు. పలువురు ముస్లింలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంబాజీపేట: త్యాగానికి, దైవత్వానికి ప్రతీక అయిన మొహర్రంను ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అంబాజీపేటలో ముస్లింలు మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మసీదులో ప్రత్యేక పార్థనలు చేశారు. అనంతరం స్థానిక కబరిస్తాన్ వద్దకు ర్యాలీగా తరలివెళ్లి పెద్దలకు నివాళులర్పించారు. తొలుత పెద్దల ఆత్మకు శాంతి చేకూరాలని దువా చేశారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

కొత్తపేట: ప్రవక్త మనవళ్లు అయిన హసన్, హుస్సేన్ ప్రాణ త్యాగానికి ప్రతీకగా మొహర్రం జరుపుకొంటున్నామని స్థానిక కమ్మిరెడ్డిపాలెం జామియా మసీదు, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు షేక్ కాజాబాబు, ముస్లిం నాయకుడు షేక్ గౌస్ వివరించారు. త్యాగానికి, దైవత్వానికి ప్రతీక అయిన మొహర్రంను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. త్యాగధనుల ఆత్మశాంతికి గత 10 రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలతో సంతాప దినాలు పాటించారు. అనంతరం 11వ రోజున బుధవారం మసీదులో మసీదు కమిటీ అధ్యక్షుడు కాజాబాబు పర్యవేక్షణలో ఇమామ్ ఇంతియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆ అమరులతో పాటు ముస్లిం పెద్దలకు ఘన నివాళులర్పించారు. రాత్రి అందరూ సహపంక్తి భోజనం చేశారు.



కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ముంపు నీరు దిగే మార్గం లేదు



ఇసుకపూడిలో నీట మునిగిన నారుమడులు

అంబాజీపేట: పంట పొలాల్లో వర్షపు నీరుతో పాటు మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో నారుమడులు, వరి పంటలు నీట మునిగిపోతున్నాయని ఇసుకపూడి బందకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చేలల్లోని మురుకు నీరు బయటకు వెళ్లే మార్గంలో బోదెలతో పాటు తూరలను ఆక్రమణదారులు అడ్డుకట్ట వేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి పంట పొలాల్లోని నీరంతా ఈ చేలల్లోకి చేరి నీట మునిగిపోతున్నాయి. గత ఏడాది నీట మునిగిపోవడంతో సాగు చేపట్టలేదని రైతులు వాపోయారు. గతంలో ఉన్న తూర మూసివేయడంతో చేలల్లో నీరు బయటకు వెళ్లడం లేదని రైతులు వాపోయారు. అలాగే పంట కాలువలో ఉన్న చెత్తా చెదారం, తూడును తొలగిస్తే మురుగు నీరు వెళ్లేందుకు మార్గం ఉంటుందని రైతులు చెబుతున్నారు. వేసవి కాలంలో నీరు కావాలంటే దొరకదని, వర్షాకాలంలో మాత్రం నీట మునిగిపోతుందని రైతులు చెబుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మురుగు నీరు బయటకు వెళ్లేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లక్ష్యాన్ని సాధించినవాడే ఏకలవ్యుడు



అంబాజీపేటలో ఏకలవ్యుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అంబాజీపేట: అలనాటి మహాభారతంలో అస్త్రవిద్యలో లక్ష్యాన్ని సాధించిన ఏకైక నాయకుడే ఏకలవ్యుడని నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కొండారెడ్డి నరహర వరప్రసాద్ అన్నారు. ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా స్థానిక బస్ స్టేషన్ వద్ద అంబాజీపేట మండల ఏకలవ్య ఎరుకుల యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఎస్టీ అధ్యక్షుడు మానుపాటి గోవిందు, గాడా గణేష్‌ల పర్యవేక్షణలో మండల శాఖ అధ్యక్షుడు భారతి వాసు అధ్యక్షతన ఏకలవ్యుడి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, గణపతి వీరరాఘవులు, కొర్లపాటి గోపి, లోకుల సురేష్, గాడా బోసుబాబు, కోసూరి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: విలువిద్య వీరుడు ఏకలవ్య మహారాజ్ జయంతిని బుధవారం పి.గన్నవరం సెంటర్లో మండల ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం ఏకలవ్యుని ఫ్లెక్సీకి పూలమాలలు వేశారు. ఆయన బర్త్ డే కేకు కట్ చేశారు. సంఘ అధ్యక్షుడు బండారి మాచేరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర మాలల జేఏసీ కోకన్వీనర్ కోట రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఏకలవ్యుని జీవిత చరిత్రను, గురువుకు ఇచ్చిన మాట కోసం ఆయన చేసిన త్యాగాన్ని వివరించారు. పాఠ్య పుస్తకాల్లో ఏకలవ్యుని పాఠ్యాంశాన్ని తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ సభ్యులు తమ పిల్లల్ని బాగా చదివించి విద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందాలని అన్నారు. నాయకులు బండారు సాయి, మానుపాటి శివ కోటేశ్వరరావు, గాడా నాగప్రసాద్, మాచగిరి ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు



ఆర్‌జేసీకి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం



మందపల్లి వంతెన వద్ద ఆలయంలో విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కొత్తపేట: తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. తెలుగు సంవత్సరంలో తొలి పండుగగా భావించే తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు, రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా స్థానిక హరిహర దేవాలయం ప్రాంగణంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి పాండురంగాచార్యులు, కొత్తపేట శివారు ఏనుగులమమల్ (మందపల్లి పెద్ద వంతెన వద్ద) గ్రామంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారికి ఆలయ పోషకుడు సిద్దంశెట్టి గంగారావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆంజనేయాచార్యులు (అంజిబాబు), స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దనస్వామి వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు శ్రీనివాసుల రామచంద్రమూర్తి (రాంబాబు), మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామివారికి, మండలంలోని శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి, సీతారామాలయాల్లో అర్చకులు బుధవారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు జరిపి విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆయా ప్రాంతాల భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: తెలుగు సంవత్సరంలో తొలి పండగ అయిన తొలి ఏకాదశిని మండలంలో భక్తులు భక్తిశ్రద్ధలతో బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. తెలుగు సంవత్సరం ఆషాఢమాసంలో ముందుగా వచ్చే ఏకాదశిని తొలిఏకాదశి అంటారని వేదపండితులు చెబుతున్నారు. కొర్లపాటివారిపాలెంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఇరుసుమండ, పుల్లేటికుర్రు గ్రామాల్లో వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: తొలి ఏకాదశి పర్వదినాన్ని మండలంలోని భక్తులు బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈసందర్భంగా ఆలయాలకు వెళ్లి భక్తులు పూజలు చేశారు. పి.గన్నవరంలోని గరుడేశ్వరాలయంలో అర్చక స్వామి భైరవభొట్ల సత్యవెంకట నారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

రావులపాలెంలో..

రావులపాలెం: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం మండలంలోని వివిధ విష్ణు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రావులపాలెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలోని, ఊబలంక రామాలయంలోని ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

వెంకన్న ఆలయానికి ప్రముఖుల తాకిడి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం తొలిఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ప్రముఖుల తాకిడి పెరిగింది. రాష్ట్ర సమగ్ర శిక్ష పథకం సంచాలకులు (ఐఏఎస్) బి.శ్రీనివాసరావు, కల్యాణీ దంపతులు, దేవదాయ–ధర్మదాయ శాఖ ఆర్‌జేసీ గొల్లపూడి రత్నరాజుతో పాటు పలువురు ప్రముఖులు స్వామి వార్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ పర్యవేక్షించారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో జిల్లా ఎస్పీ

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి.కృష్ణారావు తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి, ఆలయ వేదపండితులు సూర్యనారాయణ మూర్తి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఎస్పీ కృష్ణారావు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ కృష్ణారావును ఆలయ ప్రధానార్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో జిల్లా ఎస్పీ కృష్ణారావు తదితరులు